షార్ట్ కథ

పోర్టు ఏరియా నుండి రిక్షా మలుపు తిరిగింది. సమయం అర్ధరాత్రి దాటి రెండు. ఆకాశంలో సగం తెగిన చంద్రుడు. చుట్టూ నల్లని చీకటి. చీకటిని చీల్చే చల్లటి గాలి. దూరంగా ఎక్కడో కుక్క ఏడుపు.

కుళ్ళు కాల్వ మీద దోమల జోరు. నెత్తి మీద కన్వేయరు బెల్ట్ హోరు. బాధల్ని కడుపులో దాచుకుని ప్రశాంతంగా పడుకున్న శవంలా లోకం. ఇవేవీ పట్టనట్టు రిక్షావాడి డొక్కలు ఆయాసంతో ఎగిరి పడుతున్నాయి. పొద్దుట తిన్న నిన్నటి గెంజి అన్నాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ లేని బలాన్ని పిక్కల్లో అదింపెట్టి రిక్షా లాగుతున్నాడు. శరీరం అతని కష్టంతో తడిసిపోతోంది.

"తనడొక్కే కాకుండా ఇంటికాడ మరో నాలుగు ఎండిపోయిన డొక్కలు వున్నాయి. తెల్లారితే ఆశగా తన వంక సూత్తాయి. ఈయాల తనకి బేరం బాగానే వుంది. రిచ్చా అద్ది పోగా, రేపు చిక్కిపోయిన తమ పేగులు కాసింత నిండుతాయి. ఆ మన్నాడు సంగతి రేపు సూసుకోవచ్చు" అనుకోగానే రిక్షావాడికి కాస్త ఓపిక వచ్చినట్లయింది. తొందరగా ఇల్లు చేరాలన్న ఆతృత వాడి కాళ్ళల్లో కనిపిస్తోంది.

చిరాకు అనిపించి మరోసారి చెంగుతో ముఖం అద్దుకుంది రిక్షాలో కూర్చున్న ఆమె. ఒంటరిగా వుంది. మసక చంద్రుడిలా వుంది. ఎగిరెగిరి అలసిపోయిన పావురంలా వుంది. పులిని చూసి భయపడ్డ కుందేలు పిల్లలా వుంది. ఆమె చీర నలిగిపోయి వుంది. శరీరం వాడీ వాడని సంపెంగలా వుంది. పూలు మాత్రం బాగా వాడిపోయి వున్నాయి. నిద్ర లేమి వల్ల కళ్ళు ఎర్రగా వున్నాయి. ఆమె వయసు ఆమెకే తెలీదు. మేకప్‌లో వుంటే ఇరవై. చెరిగిపోతే ముప్ఫయ్. మొత్తానికి రిక్షాలో కూర్చున్న ఆమె, గుడిసెలో కూర్చున్న సినీ తారలా వుంది. నిరాసక్తంగా రిక్షా ముసలాడ్ని చూస్తోంది.

రోజంతా కష్టపడితే వీడికి ఏభయి రూపాయిలు రావడం కష్టం. తను అయిదు గంటలు తన అందాన్ని వడ్డించి వెయ్యి సంపాదించింది. ఆమె విరక్తిగా నవ్వుకుంది. జాకెట్‌లో దాచిన తన కష్టాన్ని తడుముకుని నిట్టూర్చింది.

"అమ్మలూ, మీ నాన్న మనందర్నీ నట్టేట ముంచి వెళ్ళిపోయేడు. మనకింక దిక్కేదే. అందరం కట్ట గలిపి సముద్రంలో దూకేద్దాం. దరిద్రం తప్పిపోద్ది" గుండె బ్రద్దలయ్యేలా తల్లి ఏడుపు.

"అక్కా, చిరిగిపోయిన బట్టలు ఎన్నాళ్ళని కట్టుకోనే. బయటకెళ్ళడానికి సిగ్గుగా వుందే" వయసు తెచ్చే మార్పులు తట్టుకోలేక చెల్లి రోదన.

"నేను ఇక బ్రాందీ షాపుల్లో పని చెయ్యలేను. అందర్లాగ చదూకుంటానే" గోముగా అడిగే తమ్ముడు కంఠంలోని బాధ.

"ఎందుకు అలా ఏడుస్తారు. నాకు వొంట్లో ఓపిక వుంది. ఇదిగో ప్రమాణం చేసి చెబుతున్నాను. మీకు కడుపునిండా అన్నం పెడతాను. మనకీ మంచి రోజులు వస్తాయి. కాస్త ఓపిక పట్టండి. మనసారా ఒక్కసారి నవ్వండి. మీ నవ్వును చూసి నేను ధైర్యాన్ని తెచ్చుకుంటాను. లేకపోతే... లేకపోతే నాకూ ఏడుపు వస్తోంది" అంటూ వాళ్ళని కౌగలించుకుని తనూ బేలగా రోదించింది.

రిక్షా గతుకుల్లో పడి ఆమె త్రుళ్ళిపడింది. పంటి బిగువున ఆలోచనల్ని ఆపుకుంటూ నెమ్మదిగా కళ్ళ నీళ్ళు వత్తుకుంది.

* * *

# అనుభవం

◊ బళ్ళా షణ్ముఖరావు

* * *

"కుటుంబం అంతా పస్తుల ఎండలో మండి మసయిపోతున్నప్పుడు దిక్కు తోచక ఈ దారిలో నడవవలసి వచ్చింది. అప్పుడప్పుడు కొన్ని రాత్రుళ్లు ఇలా కష్టపడవలసి వస్తోంది. అయితేనేం ఇంటి కష్టాలు గట్టెక్కాయి. తన వల్లే ఇల్లు నిలబడింది అనుకున్నప్పుడు ... ఆ తృప్తే ఆమెకు ఓదార్పు. "షిప్పులో దిగిన దొరబాబులికి ముందు తను కనిపిస్తే చాలు. మరి డబ్బు కోసం వెనక్కి చూడరు. కాని ఈసారి మాత్రం బాగా మొరటు సరసం అయిపోయింది. వళ్ళంతా చితక్కొట్టినట్టు నొప్పిగా వుంది. కాని ప్రతిఫలం బాగానే ముట్టింది. పాపం! ఈ ముసలాడికి రెండు రూపాయిలు ఎక్కువ ఇవ్వాలి" అనుకుంది ఆమె.

"ఒరే ముసల్నాకొడకా రిచ్చా ఆపరా" అంటూ గరుగ్గా వినిపించింది. వెంటనే ఆమె బయటకు తొంగి చూసింది. ఇన్ని రోజులకి వాళ్ళ కంట బడ్డ ఆమె గుండె గుభేల్ మంది. లయ తప్పింది. ఆగినట్టయింది. వెన్నెముకలో సన్నగా జలదరింపు. వళ్ళంతా చెమట్లు పోసాయి. సైకిలు స్టాండు వేసి దగ్గర కొస్తూ కనిపించారు ఇద్దరు పోలీసులు. బుంగ మీసాల్తో ముదరగా ఒకడు, రివటలా తెల్లగా మరొకడు.

"ఈ టైంలో ఎక్కడ్నుంచిరా తీసుకొస్తున్నావ్" అంటూ ముదర పోలీసు ముసలాడి భుజం మీద తడుతూ వాడి సమాధానం వినకుండా రిక్షాలోకి తొంగిచూశాడు. మున్సిపాలిటీ వెలుగులో చీర రెప రెపలాడింది. అతని గుండె గుబగుబలాడింది. పోలీసు అనుభవం క్షణంలో చీరని అంచనా వేసింది. మళ్ళీ పరీక్షగా చూశాడు. డేగను చూసిన పిచ్చుక పిట్టలా ఒదిగిపోతూ ఆమె కనిపించింది. కుర్ర పోలీసు దగ్గిరకెళ్ళి ఏదేదో గుసగుసలాడాడు. "అలాగే సింహాచెలం. నేను అక్కడ అంతా రెడీ చేస్తాను. నువ్వు మట్టుకు బేగా వచ్చేయి" అంటూ కుర్ర పోలీసు సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

గబుక్కున్న రిక్షా ఎక్కి ఆమె ప్రక్కన కూర్చుంటూ "తిన్నగా స్టేషన్‌కి పోనియ్యిరా ముసలోడా" అంటూ ఆర్డరేశాడు. రిక్షా బయల్దేరింది. ముదర పోలీసు ప్రక్కన కూర్చోగానే ఆమె వణికిపోయింది. రెండు చేతులూ జోడించి "బాబూ నన్ను క్షమించి వదిలి పెట్టండి. నేను తప్పు చేసేను. ఒప్పుకుంటున్నాను. మీరు వేసే జరిమానా ఇప్పుడే తమకు ఇచ్చేసుకుంటాను. స్టేషన్‌కు తీసుకెళ్ళొద్దు. నా గురించి ఇంట్లో ఎదురు చూస్తుంటారు. నన్ను వదిలెయ్యండి!"

అనుభవంతో పండిన సింహాచెలం ఆలవో

18-9-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

కగా నవ్వేడు. "నోరు మూసుకుని కూర్చో. మాటాడేవంటే మక్కెలిరుగుతాయి. తప్పుడు పన్లు సెయ్యడం, దొరికిపోతే వదిలెయ్యమని బతిమాల్డం. ఇది మీకు అలవాటే. ఏరా తొందరగా తొక్కలేకపోతన్నావేం" అంటూ మాటల్లో కోపం ప్రదర్శించేడు.

"లేదు సార్. ఇంకెప్పడూ ఇలాంటి తప్పుడు పని చెయ్యను. నన్ను వదలిపెట్టండి. మీరు అడిగినంత ఇచ్చుకుంటాను." ఏడుపు తన్ను కొస్తుండగా అతని కాళ్ళ మీద పడిపోయింది. ఆమె మెడ మీద చెయ్యేసి వెనక్కి లాగి సీట్లో కూర్చోబెట్టేడు.

"కాళ్ళట్టుకుంటే కరిగిపోడే ఈ సింవాచెలం. నా సర్వీసులో నీలాంటోళ్లని ఇంత మందిని చూసేను" అంటూ ఆమె జుత్తు పట్టుకుని ఊపుతూ చెప్పేడు. ఆమె బ్రతిమాల్డానికి అవకాశం లేకపోయింది. రిక్షా పోలీసు స్టేషను ముందు ఆగింది.


సింవాచెలం దిగి ఆమెను దిగమన్నట్టు లాఠీ ఊపాడు. బయట కుర్ర పోలీసు నిలబడి వున్నాడు. "ఒరే దీన్ని తీసుకెళ్ళి లోపల తొయ్యరా" అంటూ వాడికి చెప్పి రిక్షా వాడి దగ్గరకొచ్చాడు.

"ఏరా ముసల్నాయాల. రేపోమాపో సచ్చేలాగున్నావు. వేగంగా ఇంటికెళ్ళి తొంగోక ఇలాంటి లంజబేరాలు తగుల్తాయనా, ఇప్పటి దాకా కాసుక్కూర్చున్నావు. ఏట్రా గొణుక్కుంతన్నావు రిచ్చాలో ఒచ్చింది నీ కూతురయినట్టు ఏటి, అలా బాధపడిపోతన్నావు. ఫో. ఇక్కడ్నించి నా కొడకా" అంటూ బూటు కాలెత్తి ఫెడేల్మని ముసలాడి వడ్డి మీద తన్ని స్టేషన్ లోకి ప్రవేశించాడు సింవాచెలం.

చిన్నగా వెలుగు లోపల పడుతోంది. ఆమె వారగా తలొంచుకుని నిలబడి వుంది. శోకంతో చేసిన బొమ్మలా వుంది. మనసులో దుఃఖ సముద్రాలు పొంగుతున్నాయి. దగ్గరకెళ్ళాడు. భుజంమీద చెయ్యేసి "సూడు కేసులు లేవని మా ఎస్సై గోల పెడతన్నాడు. విన్నా గాని బ్రోతల్ కేసు కింద పుటప్ చేసానంటే మూడ్నెల్లగ్గానీ బయటకు రావు. అంచేత ఓ గంట కాలక్షేపం చేశావంటే హాయిగా ఇంటికెల్లిపో వచ్చు" అన్నాడు.



రిక్షాలో కూర్చున్న ఆమె గుడిసెలో కూర్చున్న సినీ తారలా వుంది. రోజంతా కష్టపడితే రిక్షావాడికి ఏభై రూపాయలు రావడం కష్టం. తన అందాన్ని వడ్డించి వెయ్యి రూపాయలు సంపాదించింది జాకెట్‌లో దాచిన తన కష్టాన్ని తడుముకుంది.




ఆమెకు అకస్మాత్తుగా తన కష్టార్జితం గుర్తుకొచ్చింది. "ఈ డబ్బులు గాని పోలీసోడి కంటబడితే, అమ్మో" అనుకుంది. వెంటనే కాళ్ళమీద పడింది. "సార్ నాకు ఈ రోజు వంట్లో బాగోలేదు. మీకు పుణ్యం వుంటాది. ఈవాల్టికి నన్ను వదిలెయ్యండి. రేపు నన్ను ఎక్కడికి రమ్మన్నా వస్తాను."

సింహాచెలానికి కోపం నశాళానికి అంటింది. "నీ యవ్వ. నిన్ను బతిమాలాననుకున్నావే" అంటూ పైట పట్టుకుని విసురుగా లాగాడు. చీర ఊడిపోయింది. ఆమె నిభాయించుకోలేక నేలమీద పడింది. జాకిట్లో దాచిన సొమ్ము బయటకొచ్చింది. మిలమిల మెరిసే కళ్ళతో గబుక్కున వాటిని అందుకున్నాడు. చూస్తున్న ఆమెకు కడుపు రగిలి పోయింది. లేచి తిరగబడింది. మీద కలబడి గోళ్ళతో రక్కింది. తన కష్టాన్ని దక్కించుకోవాలని తాపత్రయపడింది. కాని లాభం లేకపోయింది. దిక్కుతోచక, జేబులో డబ్బులు కుక్కుకుంటున్న సింహాచెలం గుండెలమీద తలతో ఢీ కొట్టింది. అతను దబ్బుమని నేలమీద పడిపోయాడు. ఆమె తనకు తెలీకుండానే ఏడ్చేసింది. వెక్కిళ్ళ మధ్య పిడికిళ్ళతో అతన్ని కొడుతూ.

"ఒరే ఆ డబ్బు నేను మనసు చంపుకుని సంపాదించేనురా. ఆ డబ్బుతోటే నా కుటుంబం అంతా బతకాల. నా తల్లి, నా చెల్లి, నా తమ్ముడు నా కళ్ళ ముందే చచ్చిపోకూడదని, వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళని నిలబెట్టాలని నేను కాలు జారేనురా. అంతేకాని నాకు వొళ్ళు కొవ్వెక్కిపోయి పడుకోలేదురా. నన్ను లంజకింద జమకట్టి నా సొమ్ము దొబ్బుతున్న నిన్ను ఏమని పిలవాల్రా దొంగ లంజాకొడకా" తనకి తెలీకుండానే పెద్దగా అరచింది.

దెబ్బతిన్న పులిలా తిరగబడ్డాడు సింహాచెలం. "నా రాజ్యంలో కొచ్చి నన్నే తిడతావే నీయమ్మ డియాలి. నీ పని ఇలా కాదే" అంటూ బూటు కాలితో ఆమె గుండెల మీద తన్ని తన పోలీసు ఫవరు రుచి చూపించాడు.

లారీకింద పడ్డ కుక్కపిల్లలా మూలిగింది. వెంటనే ఆమెను క్రిందకు నెట్టి బలంగా నోరు మూశాడు.

తన మీద కోపంతో నెల రోజులుగా పుట్టింటిలో వుండిపోయిన భార్య గుర్తుకొచ్చింది సింహాచెలానికి. ఇంకో నెల్లాళ్ళు రాకపోయినా తనకేం ఇబ్బంది లేదు అనుకుంటూ ఆమెను రాక్షసంగా ఆక్రమించుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు అకస్మాత్తుగా సింహాచెలానికి ఒళ్ళంతా నిస్సత్తువుగా అనిపించి లేవలేకపోయాడు. అతి కష్టం మీద లేచి డ్యూటీకి వెళ్ళాడు. వళ్ళంతా నొప్పులు. నరాలు తెగిపోయేలా బాధ. ఇక ఓర్చుకోలేక హాస్పిటల్‌కు పరిగెట్టాడు. డాక్టరు తనిఖీ చేసి రక్తం తీసుకుని 'పరీక్ష చెయ్యాలి' తర్వాత రమ్మన్నాడు. సింహాచెలానికి భయంగాను, ఆందోళనగాను వుంది. బరువు తగ్గుతూ నీరసం వస్తుంటే తనకేం జరిగిందో అర్థం కావడం లేదు. వారం తర్వాత డాక్టర్ని కలిశాడు.

"మీరు ఇకనుంచి ఎవరితోనూ, కనీసం మీ ఫేమిలీతో కూడా కలసి తిరగకూడదు. ఇంటెన్సివ్‌కేర్‌లో మిమ్మల్ని జాయిన్ చేస్తున్నాం. ఎందుకంటే మీ రక్తంలో ఎయిడ్స్ వైరస్ కనిపించింది..." డాక్టరు చెబుతున్నాడు.

ఇంతలో దభేల్‌మని చప్పుడయింది. నిలువుగుడ్లు వేసుకుని సింహాచెలం నేలమీద పడిపోయాడు. అతని కళ్ళకి దీనంగా బ్రతిమాల్తున్న ఆమె ముఖం కనబడుతోంది.